విశాలాంధ్ర

గురువారం 22 మే 2025 8 పేజీలు

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

అల్లాడుతున్న ఆక్వా

- వాతావరణ మార్పులతో కలవరం
- ఆక్వాల్యాబ్‌ల్లో పరీక్షలు తప్పనిసరి
- మృత్యువాతపడుతున్న చేపలు, రొయ్యలు
- లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

విశాలాంధ్ర-వీరవాసరం: వాతావరణంలో ఒక్కసారిగా పలు మార్పులు సంభవించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా అప్పటి వరకు భగ్గు మనేలా ఎండ, వెంటనే వాతావరణంలో మార్పులు వచ్చి వర్షం కురుస్తుండటంతో ఆక్వా చెరువుల్లోని చేపలు, రొయ్యలు మృత్యువాతపడుతున్నాయి. చెరువుల్లో ఆక్సిజన్ అందక చేపలు అల్లాడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడుతుండడంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరతతో చేపలు, వనామీ రొయ్యలు మృత్యువాత పడడంతో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. కొన్నింటికి తెగుళ్లు సోకుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 24 గంటలూ ఏరియేటర్లు తిప్పాల్సి వస్తోందని, దీంతో అధికభారం పడుతోందని రొయ్యల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో హడావిడిగా పట్టుబడులు చేస్తుండడంతో కనీస పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణ ప్రభావం చేపలపై తాత్కలికంగా పడగా వనామీ రొయ్యల మీద మాత్రం తీవ్ర పరిణామం చూపింది. చాలా వరకు రొయ్యలు మృత్యువాతకు గురవ డంతో అర్థాంతరంగా చెరువులను పట్టాల్సి వచ్చింది. రొయ్యలు కౌంటు వచ్చి సాగు చివరి దశకు చేరిన వారు చెరువులు పట్టి, ఎంతో కొంత ఖర్చులు తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కౌంటుకు రాని వారు మాత్రం పెట్టుబడి ఖర్చులు కూడా రావన్న ఉద్దేశ్యంతో ▶మిగతా 2లో..

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు

ట్రాఫిక్‌కు ఇబ్బందిగా డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర-కొవ్వూరు: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇటీవల వరకు పట్టణంలోని 300 గజాలకు పైగా నిర్మాణాలు జరగాలంటే పక్కనే ఉన్న రాజమండ్రి నుంచి రుడా పేరున ఉన్న కార్యాలయం నుంచి అనుమతులు పొందాల్సి ఉండేది. ఎక్కడో రాజమండ్రిలో కూర్చుని అధికారులు నిర్మాణాలకు అనుమతి ఇచ్చి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ▶మిగతా 2లో..

బదిలీల ప్రక్రియ ప్రారంభం

ఉపాధ్యాయుల బదిలీలకు నేటి నుంచి ఆన్‌లైన్ కౌన్సిలింగ్

విశాలాంధ్ర -ఏలూరు: ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రధానోపాధ్యాయులు ఐదు సంవత్సరాలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్.జి.టి.లు 8 సంవత్స రాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. క్యాటగిరి 1కి ఒక పాయింటు, క్యాటగిరి 2కి 2పాయింట్లు, కేటగిరి 3 కి 3 పాయింట్లు, కేటగిరి 4కి 5 పాయింట్లు ఇవ్వనున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి 8 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారి పోస్టులను క్లియర్ వేకెన్సీలుగా చూపించనున్నారు.

బదిలీలు, వెబ్ ఆప్షన్లు దరఖాస్తు చేసే తేదీల వివరాలు

ప్రధానోపాధ్యాయులు బదిలీల తేదీలు...దరఖాస్తు తేదీలు ఈనెల 21 ,22. దరఖాస్తుల పరిశీలన ఈనెల 21, 22 తేదీలు. ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు విడుదల ఈనెల 24,అభ్యంతరాల స్వీకరణ ఈనెల 25, అభ్యంతరాల పరిశీలన ఈనెల 26, సీనియారిటీ లిస్టుల తుది జాబితా ఈనెల 27,వెబ్ ఆప్షన్స్ ఈనెల 28,బదిలీల ఉత్తర్వుల పంపిణీ ఈనెల 30 న జరుగుతుంది.

స్కూల్ అసిస్టెంట్ల బదిలీల తేదీలు

దరఖాస్తు తేదీలు ఈ నెల 21 నుంచి 24 వరకు, దరఖాస్తుల పరిశీలన ఈనెల 21 నుంచి 25 వరకు, ప్రొవిజినల్ సీనియర్టి జాబితా విడుదల ఈనెల ▶మిగతా 2లో..

ఒక సచివాలయానికి ఒక వీఆర్వో

అమలు చేయాలని కలెక్టర్‌కు రెవెన్యూ జేఏసీ వినతి

విశాలాంధ్ర - అమలాపురం : గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ తరుపున గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులు, క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే విఆర్ఓను మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితుల్లో ఒక సచివాలయానికి ఒక విఆర్ఓ ఉండేట్లు నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూ జేఏసీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. వీఆర్వోల కేడర్ స్ట్రెంగ్త్ తగ్గకుండా చూడాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని కోరింది. ఒక సచివాలయానికి ఒక వీఆర్ఓ ఉండి వివిధ విధులలో క్షణం ఖాళీ లేకుండా ఉంటున్న గ్రామ రెవెన్యూ అధికారులకు రెండు సచివాలయాలకు ఒక వీఆర్ఓ అయితే మరింత పని భారం పెరుగుతుందని తెలియజేసింది. సదరు విషయమై కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ ▶మిగతా 2లో..

అజయ్ జైన్ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం భీమవరం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి, గునుపూడి ఇందిరాగాంధీ పురపాలక సంఘం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం, నాచువారి సెంటర్లో ప్రభుత్వ చౌక డిపో దుకాణాన్ని అజయ్ జైన్, కలెక్టరు చదలవాడ నాగరాణి, జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సందర్శించారు. తొలుత ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఓపిలో రిజిస్టర్లను పరిశీలించారు. రోజుకు ఎంతమంది పేషెంట్లు వస్తుంటారు అని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను అందిస్తున్న అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు,మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పట్టణంలో గునుపూడిలో ఇందిరా గాంధీ పురపాలక సంఘం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్నారు. చిన్నారుల హాజరుపట్టీని ▶మిగతా 2లో..

యోగా సాధనపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా మాసంగా పాటిస్తూ యోగా సాధనపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ షణ్మోహన్..జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో జె. వెంకట్రావు, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి. శ్రీనివాస్ కుమార్, వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాలోని వివిధ అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. యోగాంధ్ర-2025 థీమ్‌తో నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన ▶మిగతా 2లో..

జగన్ జోలికొస్తే సహించం

విశాలాంధ్ర- భీమవరం టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ జోలికి వస్తే సహించేది లేదని వైకాపా సోషల్ మీడియా విభాగ జిల్లా అధ్యక్షులు బంధన పూర్ణచంద్రరావు అన్నారు,

బుధవారం పెదమిరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బాధ్యతగల పదవుల నుండి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు, మంత్రిగా ఉన్న నీ స్థాయి ఎంత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా చేసిన ఆయన స్థానం ఎంతో తెలుసుకోవాలి అన్నారు. మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే వైయస్ జగన్ అభిమానులు ఊరు కునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. మీడియా ఫోకస్ కోసమే ఆయన ఎన్ని డ్రామాలైనా ఆడతాడని ఎద్దేవా చేశారు, మరొకసారి జగన్మోహన్ రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తి హెచ్చరించారు.

వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించు కోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాల యంలో వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభం (1వ పేజీ తరువాయి)

26, 27 తేదీలు, అభ్యంతరాల స్వీకరణ ఈనెల 28, అభ్యంతరాల పరిష్కారం ఈనెల 28,29 తేదీలు,ఫైనల్ సీనియారిటీ లిస్టు విడుదల ఈనెల 31, వెబ్ ఆప్షన్స్ వచ్చే నెల 1,2,తేదీలు, బదిలీ ఉత్తర్వుల జారీ వచ్చే నెల 4వ తేదీ, ఎస్ఏలకు హెచ్ఎం లుగా పదోన్నతులు ఈనెల 30వ తేదీ, పదోన్నతుల ఉత్తర్వులు జారీ తేది ఈ నెల 31 న ఉంటుంది.

సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల తేదీలు

దరఖాస్తు తేదీలు ఈనెల 21 నుంచి 27 వరకు,పరిశీలన ఈనెల 21 నుంచి 28 వరకు,ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా విడుదల ఈనెల 31,అభ్యంతరాల స్వీకరణ ఈనెల 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు,అభ్యంతరాల పరిష్కారం ఈనెల 28 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు,

ఫైనల్ సీనియారిటీ లిస్టు వచ్చే నెల ఆరవ తేదీ,వెబ్ ఆప్షన్స్ వచ్చే నెల 7 నుంచి 10 వరకు,బదిలీ ఉత్తర్వులు వచ్చే నెల 11, ఎస్జీటీలకు పదోన్నతులు వచ్చే నెల 5వ తేదీ,పదోన్నతుల ఉత్తర్వులు జారీ వచ్చే నెల 6వ తేదీన ఉంటుందని అధికారులు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

వీఆర్వో (1వ పేజీ తరువాయి)

సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ జెఏసి చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్, జిల్లా అధ్యక్షులు సాధనాల ఎల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు మద్దాల బాపూజీ, సహా అధ్యక్షులు కెవి గణేష్, కొత్తపేట డివిజన్ నుంచి ఈవీవీ సత్యనారాయణ, బాబ్జి, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు స్వామినాయుడు మరియు జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన (1వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నెలరోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టి అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం ద్వారా చిట్ట చివరి వ్యక్తి వరకు యోగా చేరేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్య అధికారులు, వివిధ యోగ అసోసియేషన్ ప్రతినిధులు సభ్యులు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యటన (1వ పేజీ తరువాయి)

పరిశీలించారు. ప్రభుత్వం చౌక డిపోల ద్వారా అందించే సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి, డ్వామా పిడి డా.కె.సి.హెచ్. అప్పారావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు (1వ పేజీ తరువాయి)

లేకపోవడంతో విచ్చలవిడిగా నిర్మాణాలు జరిగాయన్న ఆరోపణలు భారీ ఎత్తున వినిపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుడా వద్ద ఉన్న అధికారాలను స్థానిక మున్సిపాలిటీలకు అప్పగించడంతో పర్యవేక్షణకు ఇబ్బంది లేకుండా పోయింది. దీంతో ప్రయాసపడి రాజమండ్రి వెళ్లి అనుమతులు తెచ్చుకునే నిర్మాణదారులకు కూడా వెసులుబాటు లభించింది. ఈ అవకాశాన్ని కొవ్వూరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ శాఖ అందిపుచ్చుకొని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను గుర్తించే అవకాశం నెలకొంది.

డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు

కొవ్వూరు పట్టణంలో విజయ విహార్ సెంటర్, బస్టాండ్ సెంటర్, ఎల్ఐసి సెంటర్ ఇలాప్రతి సెంటర్లోనూ వ్యాపార సముదాయాల ముందు భాగంలో ఉన్న డ్రైన్లపై స్లాబులు ఏర్పాటు చేసి వాటిపై బడ్డీలు పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు అసలే కొవ్వూరులో ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారులు ఈ ఆక్రమణల వల్ల మరెన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ మధ్యన మున్సిపల్ అధికారులు విజయ విహార్ సెంటర్లోని కొన్ని దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించారు. ఈ ఆక్రమణల వల్ల మరో ప్రధానమైన సమస్య వెంటాడుతుంది. స్లాబుల్ కింద ఉన్న డ్రైన్లలో సిల్టు తీయలేక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఉన్న డ్రైన్ల మీద ఉన్న స్లాబుల కింద పెద్ద ఎత్తున సిల్టు పేరుకుపోవడంతో మున్సిపాలిటీ ప్రతి ఏడాది టెండర్లను పిలిచి డ్రైన్లలోని సిల్టును ఎత్తి బయటకు వేయిస్తున్నారు . దీనివల్ల మున్సిపల్ సొమ్ము వృధా అవుతుందన్న అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పుష్కరాలు రానున్న దృష్ట్యా ఈ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాల్సి ఉంది. 2014 లో వచ్చిన పుష్కరాలు సమయంలో అప్పటి కలెక్టర్ కాటమనేని భాస్కర్ కొవ్వూరు పట్టణాన్ని రహదారులను వెడల్పు చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ కొన్ని రాజకీయ శక్తులు ఆయనకు అడ్డుపడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కలగా మిగిలిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్..

రెవెన్యూ డివిజన్ రావడంతో ఇక్కడ 40 వరకు ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కోర్టుతోపాటు పలు మేజిస్ట్రేట్ కోర్టులు ఇక్కడ ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో ట్రాఫిక్ మరింతగా పెరిగిపోతున్నది. గత రెండు దశాబ్దాల క్రితం ఎంత ట్రాఫిక్ ఉందో ఇప్పుడు దానికి రెండు రెట్లు ట్రాఫిక్ పెరిగి తీవ్ర ఇబ్బంది నెలకొంది. దీనిపై కూడా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఆక్వా (1వ పేజీ తరువాయి)

చని పోతున్న రొయ్యలను అలానే వదిలేశారు. వేసవి ఉష్ణోగ్రతల్లో అనుకూలంగా జరిగే వనామీ, చేపల సాగుకు మంగళవారం కురిసిన వర్షం దెబ్బ గట్టిగానే తగులుతోందని రైతులు లబోదిబో మంటున్నారు. మరో రెండు మూడు రోజులు ఇలానే వాతావరణంలో మార్పులు సంభవిస్తే మాత్రం ఆక్వాసాగు తుడుచు పెట్టుకుపోవటం ఖాయమని వాపోతు న్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

అదనపు వ్యయం

సురేష్, ఆక్వా రైతు, రాయకుదురు

వాతావరణంలో మార్పులు సంభవించి నప్పుడల్లా ఆ ప్రభావం రైతులపై పడుతుంది. ఫలితంగా అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి చేపలకు, రొయ్యలకు కూడా నష్టం వాటిల్లుతుంది. అసలే ఒక పక్క ఆక్వా ఉత్పత్తులకు సరైన ధర లేక పోవడం వల్ల నష్టపోతున్నాం. వాతావరణం ప్రభావం ఏమేరకు ఉంటుందోనని భయపడుతున్నాం.

ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో ఇబ్బంది

మురళి, ఆక్వా రైతు, వీరవాసరం

వాతావరణంలో ఒక్కసారిగా సంభవించే మార్పుల వల్ల తట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

వేసవి కాలంలో వాతావర ణానికి అలవాటు పడిన చేపలు, రొయ్యలు ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయి.

ఉద్యోగులు యోగా అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రతి ఉద్యోగి యోగ చేయటం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో వాణి, తహసిల్దార్ ప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన లింగపాలెం మండల పరిషత్ కార్యాల యంలో అధికారులు, ఉద్యోగులు యోగా శిక్షణలో పాల్గొన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల

మేరకు నెల రోజులు పాటు జరిగే యోగ శిక్షణను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని తహసిల్దార్,ఎంపీడీవో ఉద్యోగులను ఆదేశించారు.మారుతున్న పరిస్థితుల వల్ల ప్రతి మనిషిపై మానసిక వత్తిడి పెరుగుతుందని అన్నారు. ప్రధానంగా ఈవత్తిడి ఉద్యోగులపై అధికంగా ఉందని వత్తిడిని అధికమించటానికి యోగ దోహదపడ తుందని అధికారులు వివరించారు. ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా యోగా చేయాలని అధికారులు సూచించారు.యోగా వల్ల మానసిక ప్రశాంతత నెలకొంటుందని దీనివల్ల విధులు నిర్వర్తించటం సులభం అవుతుందని అన్నారు.యోగా చేయటం వల్ల ప్రతి వ్యక్తి జీవితానికి ఎంతగానో ప్రయోజనంగా కలుగుతుందని వివరించారు. ఎక్కువ మంది ఉద్యోగులు వత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని దీనివల్ల విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించలేకపోవటం జరుగుతుందని అన్నారు. వీటిని అధిగమించటానికి యోగ ఒక అస్త్రమని వివరించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో యోగాసనాలపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు.

దంత వైద్య నిపుణులు నరేంద్ర హఠాన్మరణం

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రముఖ వైద్య నిపుణులు కే.గోకవరంకు చెందిన మండవపు నరేంద్ర(52) హఠాన్మరణం చెందారు. గుండెపోటు రావడంతో ఏలూరు లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తీసుకు వెళ్లారు. అప్పటికే ఈయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారని కుటుంబ సభ్యులు తెలిపారు. దంత వైద్య నిపుణుడిగా ఈయనకు మంచి పేరు ఉంది. వైద్య వృత్తితో పాటు తెలుగుదేశం పార్టీకి వీరాభిమానిగా గుర్తింపు ఉంది. కే గోకవరంలోనే

గాక లింగపాలెం మండలం,చింతలపూడి నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తుంటారు. ఈయనకు భార్య, నాలుగేళ్ల బాబు ఉన్నారు. ఈయన మృతి పట్ల గ్రామంలోనూ మండలంలో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైద్యునిగా, తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఈయన సేవలు ఎనలేనివని పలువురు కొనియా డారు. డాక్టర్ నరేంద్ర అంత్యక్రియలు స్వగ్రామమైన కే. గోకవరంలో గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రీసర్వేకు హాజరు కావాలి

విశాలాంధ్ర - నిడమర్రు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏపి రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా నిడమర్రు మండలంలోని పెద రామచంద్రపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ విలేజ్‌గా నిర్ణయించి రీసర్వే నిర్వహించవలసిందిగా ఏలూరు కలెక్టర్ ఆదేశించి నట్లు నిడమర్రు తహసిల్దార్ ఎన్. నాగరాజు బుధవారం తెలిపారు. 22 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాల యం అదవి కొలనులో గ్రామ సభ ఏర్పాటు చేసినట్టు తహసిల్దార్ తెలిపారు. ఈ సభకు పెదరామచంద్రపురం గ్రామ రైతులందరూ సకాలంలో హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

నూజివీడు పెద్ద చెరువు గండ్లను వెంటనే పూడ్చాలి

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: గత ఏడాది సెప్టెంబర్లో వచ్చిన వరదల కారణంగా నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువుకు గండ్లు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సిపిఐ నాయకులు బుధవారం చెరువు గండ్లను పరిశీలించారు ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ గత సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో సంభవించిన వరదల కారణంగా నూజివీడు పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడి చెరువు ఆయకట్టు కింద ఉన్న పంటలు పూర్తిగా కొట్టుకునిపోయాయన్నారు. సమీప గృహాల్లోకి భారీగా నీరు చేరి ఆస్తి నష్టం జరిగిందన్నారు. గత ఏడాది ఏర్పడిన గండ్లు నేటికీ పూడ్చలేదన్నారు. రానున్నది వర్షాకాలం దృష్ట్యా అధికారులు మేల్కొని గండ్లను పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు ఎన్ నరసింహ, ఎం. నాగేంద్రరావు , ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

దీపం పథకంతో వెలుగు

విశాలాంధ్ర -భీమవరం: దీపం పథకం పేదింటి మహిళల్లో వెలుగులు నింపిందని రాష్ట్ర పర్యాటకం, గృహ నిర్మాణం శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. బుధవారం రాష్ట్ర పర్యాటకం, గృహ నిర్మాణం శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ భీమవరం పట్టణం దుర్గాపురంలో దీపం పథకం

లబ్ధిదారుని ఇంటికి వెళ్లి దీపం పథకం ప్రయోజనాలను అడిగి తెలుసు కున్నారు. పేద మహిళలకు ఆర్థిక ప్రయోజనం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకాన్ని ప్రవేశపెట్టిం దని, సంవత్సరానికి మూడు సిలిండర్లను ఉచితంగా అందజేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. లబ్ధిదారుని గృహంలో స్వయంగా గ్యాస్ స్టవ్‌ను వెలిగించి టీకాచి లబ్ధిదారునికి స్వయంగా అందజేయడంతో లబ్ధిదారు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పెషల్స్ సీఎస్ అజయ్ జైన్ కాచిన టీ తాగి చాలా రుచికరంగా పెట్టారని అభినందించారు.

గణపవరం గ్రంథాలయంలో పోటీలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శెలవులు పురస్క రించుకుని విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా కథలు చెప్పడం, క్యారం, చెస్

తదితర ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి ఎన్. సుభాషిని, గుమ్మడి సుబ్బారావు విచ్చేశారు.

బొర్రంపాలెం సర్పంచ్ చెక్కు పవర్ రద్దు

విశాలాంధ్ర-టి నరసాపురం: బొర్రంపాలెం పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ చెక్కు పవర్ ను జిల్లా పంచాయతీ అధికారులు రద్దు చేసినట్లు ఎంపీడీవో జి. మణి కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండు రంగ బొర్రంపాలెం పంచాయతీలో నిధులు దుర్వినియోగం పై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా స్పందించిన ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం రుజువు కావడంతో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ చెక్కు పవర్ రద్దు చేసి అప్పటి పంచాయతీ కార్యదర్శుల వద్ద నుండి దుర్వినియోగ మైన నిధులు రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెయింటర్స్‌తో సహా నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏలూరు నగర పెయింటర్స్ యూనియన్ (ఏఐటీయుసి)సమావేశం బుధ వారం స్ఫూర్తి భవన్లో పి.వంశీ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న హాజరైన శ్రీనివాస డాంగే, భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తా మని హామీ ఇచ్చారని తెలిపారు. ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సంక్షేమ బోర్డుకు మొదటగా తాను రూ. 1కోటి జమ చేస్తానని హామీ ఇచ్చి సంవత్సర కాలం గడుస్తున్నా,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని అన్నారు. ఉచిత ఇసుక అంటున్నప్పటికీ సాధారణ గృహ వినియోగ దారులకు ఎక్కడా ఇసుక అందుబాటులో ఉండటం లేదన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పెయింటర్లు అర్థాకలితో జీవిస్తున్నారని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెయింటర్స్ యూనియన్ నాయ కులు అజిత్ కుమార్, వి. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, పలివెల సాయి, బి.కోట సత్యనారాయణ, జి.వెంకట రమణ, వై.ప్రసాద్, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

విశాలాంధ్ర- ఉండి : విద్యుత్ శాఖ అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. బొజ్జ రవి(23) విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వెలివర్రు గరువు రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. రవికి భార్య మావుళ్ళమ్మ, నెల రోజుల వయసు ఉన్న కుమారుడు ఉన్నారు. రవిని వరుసకు పెదనాన్న అయిన అద్దూరి పోలయ్య పెంచి పెద్దవాడిని చేసి పెళ్లి చేశాడు . మండల కేంద్రమైన ఉండి యానాదుల కాలనీకి చెందిన రవి, ఉబ్బని నాగరాజు బుధవారం మధ్యాహ్నం విలువరు గరువు రోడ్ లో ఉన్న ముురుగు, పంట బోదె లో చేపలు పట్టేందుకు వెళ్లారు. నాగరాజు బోదె లోనికి దిగి నీటిని కదిలించి చేపలను తరిమే పనిలో ఉండగా రవి చేపల వలవేసేందుకు బోదెలోనికి దిగుతుండగా తుప్పల్లో తెగిపడిన విద్యుత్ వైర్ తగిలి అక్కడకక్కడే మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారులు తెగిపడిన విద్యుత్ వైర్‌ను నిర్లక్ష్యంగా వదిలివేయటంతో పాటుగా వాడుకలో లేకపోయినప్పటికీ విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడం రవి మృతికి కారణమని స్థానికులు బంధువులు ఆరోపిస్తున్నారు. రవి మృతితో వారి కుటుంబం వీధిన పడిందని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, సన్నాల శ్రీను, పత్తివాడ గణపతి పలువురు

వాపోతున్నారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విద్యుత్ అధికారులు

రవి మృతివార్త తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు స్థానిక ఎస్సై మహమ్మద్ నసిరుల్లా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

పోలీసులు రవి మృతి వివరాలను సేకరించి కేసు నమోదు చేసి రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రవి మృతి చెందాడని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు జరగాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు జరగాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించి వారి వివరాలు, విద్యార్హత,వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి అన్నారు. టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20కి మించరాదని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ యాజమాన్యం 25శాతం సీట్లను,ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు మైనారిటీలకు కేటాయించాలని,పాఠశాల యాజమాన్యాలు నోటు బుక్స్, యూనిఫారాలు,బ్యాగ్ లు ఇతర స్టేషనరీ అమ్మ రాదని, విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్ లైన్ లో ఉంచాలని,ఆట స్థలం తప్పని సరిగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

మినీ మహానాడుకు పెద్దఎత్తున తరలిరండి

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-నూజివీడు: ఏలూరు జిల్లా స్థాయిలో ఈనెల 22వ తేదీన జరిగే మినీ మహానాడు ఏర్పాట్లపై నూజివీడులో మంత్రి కొలుసు పార్థ సారథి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నూజివీడు పట్టణంలో నూజివీడు అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో జరిగే మినీ మహానాడుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. మినీ మహానాడు ఏర్పాట్లు కూటమి నాయకులు కార్యకర్తలు సమన్వ యంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు భోజన, మంచి నీటి ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని మంత్రి సూచించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల నుండి వచ్చే తెలుగుదేశం కార్యకర్తలకు మంచి ఆతిథ్యం ఇవ్వాలని నాయకులకు మంత్రి సూచించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతృప్తితో ఉన్నారన్నారు. రైతుల సమస్యలను ఇప్పటికే కేబినెట్లో చర్చించామని, రైతులను మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. రైతుల అభివృద్ధికి సాంకేతికను జోడించి ఒక్కొక్క నియోజకవర్గానికి ప్రభుత్వం సబ్సిడీ పై ఒక డ్రోన్ రైతులకు అందిస్తుందన్నారు. గురువారం జరిగే మినీ మహానాడుకు తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దెందులూరు ఏఎంసీని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: రూ.100 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకునేలా దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తామని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురం మార్కెట్ యార్డులో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గారపాటి రామసీత సహా డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లా డుతూ

దెందులూరు నియోజకవర్గంలో అత్యధిక శాతం మంది రైతులు ఉండటంతో వారి సంక్షేమం విషయంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అటువంటి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా కూటమి పార్టీల సమన్వయంతో ఏకగ్రీవంగా గారపాటి రామసీత, మూడు పార్టీల సమన్వయంతో డైరెక్టర్లు కూడా నియామకం అవ్వటం ఎంతో అభినందనీయం అన్నారు. దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్,మండల పార్టీల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), నంబూరు నాగరాజు, ఈదుగంటి అనిల్, గ్రామ పార్టీల అధ్యక్షులు సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం...దారుణం

విశాలాంధ్ర - నరసాపురం: కళాశాల అభివృద్ధికి నిధుల కోసమే స్థలాన్ని విక్రయించామని పట్టణంలోని బీజేబీవీఎస్ మహిళా కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. కళాశాల సెమినార్ హాలులో బుధవారం కళాశాల అధ్యక్షుడు నూలి రమణ మూర్తి, కోశాధికారి తుమ్మలపల్లి భద్రం, ప్రిన్సిపాల్ సి.నీరజ తో కలసి నిర్వహించిన

విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థాపకుడు అద్దేపల్లి సర్వేచెట్టి స్థాపించిన ఈ కళాశాలకు కమెండొరు వంశీయులు దానం చేసిన స్థలంలో 600 గజాలు మార్కెట్ ధరకు విక్రయించామని తెలిపారు. కళాశాల బైలా ప్రకారం నడుచుకుంటున్నామన్నారు. కొంతమంది పనిగట్టుకుని అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. కళాశాల లో నూతన కోర్సులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొంత మంది పనిగట్టుకుని కళాశాల అభివృద్ధికి పాటుపడుతున్న తమపై ఆరోపణలు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా అటువంటి ఆరోపణలు మాని కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

ఏలూరు జిల్లాకు మణిహారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొప్ప శుభపరిణామమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు కొన్ని కారణాల వలన విద్యను మధ్యలో నిలుపుదల చేసిన వారు ఈ యూనివర్శిటీ ద్వారా దూర విద్యను అభ్యసించి తమ విద్యను కొనసాగించే అవకాశం కలుగుతుందన్నారు. చదువు, వయసుతో సంబంధం లేకుండా అంబేద్కర్ యూనివర్శిటీ ద్వారా దూర విద్యను అభ్యసించి డిగ్రీలు పొందవచ్చన్నారు. తద్వారా రాష్ట్రంలో అక్షర శాతం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యా శాతం పెరగడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు ఈ దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు తల్లి దీవెన,డిజిటల్ క్లాసుల ద్వారా విద్యా ప్రమాణాలు పెంచిందని ప్రతీ ఒక్కరూ చదువుకొని రాష్ట్రంలో అక్షర శాతం నూటికి నూరు శాతం పెంచాలని అన్నారు. అంబేద్కర్ యూనివర్శిటీ ఏలూరు సమీపంలో ఏర్పాటు కాబోతుండం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : శారీరక ఆరోగ్యానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో కిరణ్ కుమార్ తెలిపారు. జూన్ 21వ తేదీన యోగ డే సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోపీఆర్డి సతీష్ గ్రామస్తులతో కలిసి యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు యోగ చేయడం అలవాటు చేసుకోవాలని, శారీరక ఆరోగ్యానికి యోగ ఎంతో దోహదపడుతుందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చెల్లన్న దొర, ఈవోపీఆర్డి సతీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకయ్యమ్మ, కొల్లూరి సత్తిబాబు, కంభంపాటి సాయి కృష్ణ, కాకరపర్తి స్వామి, యం .సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని శాశ్వతంగా పారద్రోలాలి

విశాలాంధ్ర - నరసాపురం: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని శాసన మండలి ప్రభుత్వ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. నరసాపురం వీవర్స్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అధ్యక్షతన నిర్వహించిన టీడీపీ మినీ మహానాడులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కులాలుగా విభజించి విమర్శించే సంస్కృతి తీసుకు వచ్చారన్నారు. మద్యం మత్తులో అకృత్యాలకు పాల్పడ్డారన్నారు. అటువంటి వైసీపీ పార్టీని శాశ్వతం గా లేకుండా చేయాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) సభ్యులు ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాల నాశనం చేసిన వైసీపీ పార్టీని ప్రారదోలాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేస్తాం

- హౌసింగ్ పీడీ వెల్లడి
- పోలవరం ఆర్ అండ్ ఆర్ గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రాష్ట్రంలో సామూహిక గృహ ప్రారంభోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది జూన్ 10వ తేదీ నాటికి ఏలూరు జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలో మిగిలిన 2739 గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించినట్లు వివరించారు. బుధవారం ఏలూరులోని హౌసింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడి సత్యనారాయణ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 13,525 గృహాలు నిర్మించాలని గతంలో లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 8171 నిర్మాణాలు పూర్తి చేసినట్టు తెలిపారు. మిగిలిన 5400 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వాటిని కూడా జూన్ 10వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో నిర్మించేందుకు క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 60 శాతం గృహ నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన 40శాతం పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామ న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనంగా మరో 50 వేల రూపాయలు గృహ నిర్మాణానికి కేటాయించిందని వివరించారు. పి ఎం ఈ వై అర్బన్ ప్రాంతాల్లో స్థలాలు ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ఈ విధంగా జిల్లాలో 2600 మంది దరఖాస్తు చేసుకోగా వాటి డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్లలో రెండవ దఫా మంజూరైన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దెందులూరు, నూజివీడు ప్రాంతాల్లో గృహ నిర్మాణ శాఖ గోదాముల్లో దొంగలు పడి స్టీలు, సిమెంటు దొంగలించగా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామని అన్నారు. చాట్రాయి మండలం సుంకొల్లు గ్రామంలో సుమారు రూ.16.52 లక్షల రూపాయల విలువ కలిగిన 2450 సిమెంట్ బస్తాలు, 12 వేల కేజీల ఐరన్ దుర్వినియోగం అయిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశాల మేరకు ఆ మండల ఏఈ పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలో 2739 గృహాలు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 8302 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 5,563 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 2739 గృహాలు నిర్మించే విషయంలో ప్రభుత్వం నిర్ణీత సమయంలో కాంట్రాక్టర్లకు సొమ్ములు చెల్లించకపోవడంతో వాటిని నిలిపివేశార న్నారు. ఈ విధంగా గత మూడు సంవత్సరాల నుండి గృహాలు నిర్మాణం నిలిచిపోగా తాజాగా పాత కాంట్రాక్టర్లను రద్దుచేసి మే 7వ తేదీన ఈ గృహాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ ఏడాది మే నెలకి టెండర్లు ప్రక్రియ పూర్తయ్యి ఆర్ అండ్ ఆర్ గృహాల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పిడి సత్యనారాయణ స్పష్టం చేశారు.

మరుగుదొడ్లు లేక మహిళల ఇక్కట్లు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక జడ్పీ గెస్ట్ హౌస్ కలెక్టరేట్ కు వెళ్లే దారి ఎస్.బి.ఐ. ప్రక్కన గతంలో నగరపాలక సంస్థ వారు ఏర్పాటుచేసిన పే అండ్ యూస్ మరుగుదొడ్లు మూత పడటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతిరోజు అనేక ధర్నాలు, మీడియా పాయింట్ గా ఉన్న ఇక్కడ ధర్నాలకు,తమ సమస్యలను విన్నవించు కోవటానికి కలెక్టరేట్ కు వచ్చే మహిళలకు మరుగు దొడ్ల సౌకర్యం లేక పోవడం వల్ల మహిళలు నరకయాతన పడుతున్నారు. ఈ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అయోమయ స్థితిలో ఉన్నారు.దూరంగా ఉన్న మరుగుదొడ్లను వెతుక్కుంటూ అనేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఎస్.బి.ఐ. పక్కనున్న మరుగుదొడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చేయాలని మహిళలు కోరుతున్నారు.

బహిరంగ వేలం ప్రకటన

ది.20-05-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం గురజ గ్రామములోని ప్రాథమిక పాఠశాల-2 యొక్క విడగొట్టిన మద్ది కలప మెటీరీయల్‌ను విక్రయించుటకు **మే 28-05-2025 తేదీ ఉదయం 10.00 గం॥లకు** పాఠశాల ఆవరణలో వేలం పాట నిర్వహించబడును. ఆసక్తి కలవారు ముందుగా **రు. 1000/-** డిపొసిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగలరు.

వై రామకృష్ణ, ఎంపీడీవో
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

మానవ ఆరోగ్య జీవనానికి యోగ ప్రధాన పాత్ర

కమిషనర్ భాను ప్రతాప్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మానవ దైనందిన జీవితంలో ఆరోగ్యకరంగా మానసిక ప్రశాంతతతో జీవించడానికి యోగ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భాను ప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. జూన్ 21వ తేదీన 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం నుండి నెల రోజులు పాటు ప్రతి రోజు యోగా క్లాసులు నిర్వహిస్తూ యోగ విశిష్టతపై ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నం వేదికగా జరగబోవు ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవు తున్నారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తింటున్న ఆహారం వలన మనిషికి శారీరకంగా వ్యాయామం లేకపోవడం కారణంగా అనేక రకాలైన రుగ్మతలతో పాటు అనేక వ్యాధులకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గభవాని యోగాసనాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువు శివ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ మూర్తి, డీఈలు, ఏఈలు, పిఓ, మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించి అన్ని సెక్షన్ల, అధికారులు, సూపరింటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా టీడీపీ కమిటీల నియామకం

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: నియోజకవర్గంలో 85 గ్రామాలలో ఏకగ్రీవంగా కమిటీల నియామకం చేపట్టామని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో దెందులూరు నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాలను అభివృద్ధి చేయడం,ప్రజలకు సంక్షేమాన్ని అందించడం లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, తెలుగుదేశం పార్టీనీ బలోపేతం చేయడమే లక్ష్యంగా దెందులూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్య క్షులు విక్రమ్ కిషోర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, మండల పార్టీల అధ్యక్షులు మాగంటి నారా యణ ప్రసాద్ (మిల్లు బాబు), నంబూరు నాగరాజు, ఈడ్పుగంటి అనిల్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకతవకలకు తావులేకుండా టీచర్ల బదిలీలు నిర్వహించండి : జెడ్పీ చైర్మన్

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వ హించా లని జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, డీఈఓ వెంకటలక్ష్మమ్మతో సమీక్షించారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బదిలీల విధివిధానాలు, అమలు ప్రక్రియ, ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. బదిలీల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పారదర్శకంగా, నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమి షనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కెవీ పద్మావతి సీడీఎంఈకు రిపోర్ట్ చెయ్యాలని అదేశాలు అందడంతో ఆమె స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన కాకినాడ కార్పొరేషన్లో సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భగా కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పురప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పట్టణ పరిశుభ్రతతో పాటు పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.

నిర్మాణంలో అలక్ష్యం వహిస్తే నోటీసులు జారీ

విశాలాంధ్ర - పెదపూడి : లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అలక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేస్తామని హౌసింగ్ ఇంచార్జ్ ఎఈ సోమిరెడ్డి అన్నారు. బుధవారం గొల్లల మామిడాడ పంచాయతీ కార్యాలయంలో స్థలాన్ని పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడివో ఎమ్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. శ్రీనిధి నుండి తీసుకున్న సొమ్ముకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు వడ్డీ చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ కొవ్వూరి సత్యనారా యణ రెడ్డి, ఇవో కనక నాగేంద్ర, వెలుగు సిసి కో ఆర్డినేటర్ శ్రీనివాస్, కూటమి నేతలు మేడపాటి వర ప్రసాద్ రెడ్డి, మురమళ్ళ వెంకట రమణ, ఇంజనీర్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్

విశాలాంధ్ర - కాకినాడ : Young Minds రేపటి కోసం పీఆర్టీయూ, కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ వారు సంయుక్తంగా మే 25 ఆదివారం డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థులకు ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు యంగ్‌మైండ్స్ సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ (చిన్న మాష్టారు) తెలిపారు. ఈ రోజు పరీక్షకు సంబదించిన పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు చింతాడ. ప్రదీప్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బారావు, బాపిరాజు పాల్గొన్నారు. పరీక్ష స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లె 25న మధ్యాహ్నం 2గం. నుండి 4:30 ని.ల వరకు. నిర్వహించారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి : మంత్రి కందుల

విశాలాంధ్ర - నిడదవోలు : నిర్మాణంలో ఉన్న మురికినీటి కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని అనేక ప్రాంతాలలో పర్యటించారు. తొలుత పట్టణంలోని బస్టాండ్ మార్గంలోని 11వ వార్డు ఉజ్జినవారి వీధిలో పర్యటించిన మంత్రి దుర్గేష్ స్థానికంగా జరుగుతున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. వార్డు ప్రజలతో స్వయంగా మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. త్వరితగతిన మురుగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతుండడంతో ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తా చెదారం వంటివి లేకుండా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి దుర్గేష్ స్థానిక ప్రజలకు తెలిపారు. మంత్రే స్వయంగా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకోవడం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తపరిచారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

వాతావరణం లో విపత్కర మార్పులకు తోడు విద్యుత్తు అంతరాయంతో వృద్ధులు, చిన్నారులతో పాటుగా స్థానిక ప్రజలు ఉక్క పోతతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కూటమి నాయకులు విద్యుత్ సమస్యను స్థానిక మంత్రి కందులు దుర్గేష్ దృష్టికి తెలుపగా స్పందించిన మంత్రి దుర్గేష్ ట్రాన్స్ఫర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. నిడదవోలు మండలంలోని పెండ్యాల గ్రామంలో గత 15 రోజులుగా తక్కువ వోల్టేజ్ కారణంగా తరచూ విద్యుత్ అంతరాయంతో వృద్ధులు చిన్నారులతోపాటు గ్రామస్తులు ముఖ్యంగా రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామ నాయకులు మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకు వెళ్ళారు. దీంతో స్పందించిన కందులు దుర్గేష్ గ్రామ ప్రజల అవసరాన్ని బేరీజు వేసి, విద్యుత్ శాఖ అధికా రులతో మాట్లాడి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫలితంగా గ్రామంలో నాలుగు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫా ర్మర్లును నూతనంగా తక్షణమే ఏర్పాటు చేయడంతో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.సమస్య గూర్చి చెప్పిన వెంటనే స్పందించి పరిష్కారం చేసిన మంత్రి వర్యులు కందుల దుర్గేష్ కు పెండ్యాల గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

నిస్వార్థ నేత శ్రీను: ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ మొదటి నుంచి పార్టీ వెన్నంటి ఉండి ప్రజా సేవ అందిస్తున్న నిస్వార్థ నేత దత్తుడు శ్రీను అంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొని యాడారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను) జన్మదినోత్సవం సందర్భంగా ఆయనతో ఎమ్మెల్యే నల్లమిల్లి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి సత్యనారాయణ రెడ్డి (పొలమూరు), సబ్బెళ్ళ జగ్గిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి శేషారత్నం,వర్తక సంఘం అధ్యక్షులు కొవ్వూరి వెంకట రామారెడ్డి,ఓగిరెడ్డి రాధ, సత్తి దేవదాన రెడ్డి,కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి ఆదినారాయణ రెడ్డి, మేడపాటి సత్యనారాయణ రెడ్డి (అన్న వరం), కర్రి సూర్యనారాయణ రెడ్డి (సూరి) ఇంకా పెద్ద ఎత్తున ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులు ఎక్కడ ?: గిడుగు

విశాలాంధ్ర - అమలాపురం : జమ్మూ కాశ్మీర్లో టూరిస్టులపై పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రదాడి జరిగి నేటికీ నెల రోజులైనా కిరాతక ఉగ్రవాదుల్ని పట్టుకోవడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిడబ్ల్యూసి సభ్యుడు పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్దరాజు ఆరోపించారు. మోదీ నాయకత్వంలోనే బిజెపి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని వెంటనే ప్రభుత్వం అధికారం నుండి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం అమలాపురంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రుద్రరాజు మాట్లాడారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు జరిగాయి. దేశ సరిహద్దు నుండి 65 కిలోమీటర్లు భారత భూభాగంలోకి పాకిస్తాన్ టెర్రరిస్టులు చొచ్చుకు వచ్చి అమాయక పర్యాట కులను విచక్షణారహితంగా కాల్చి చంపారని ఆయన ఆం దోళన వ్యక్తం చేశారు. ఆ టెర్రరిస్టులు ఏమయ్యారు. మన భూభాగం నుంచి పాకిస్థాన్లోకి వెళ్లిపోయారా లేదా మన సైనికులకు పట్టుబడి జైల్లో ఉన్నారా ఏది చెప్పకుండా ప్రధాని మోదీ రక్షణ మంత్రి రాజ్నాథ్‌సింగ్ నీళ్లు నమ్మటం సిగ్గుచేటు అన్నారు. ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణపై ఏకపక్ష ప్రకటన చేయడం ఏమిటని ఆయన ఎద్దేవా చేశారు. సమావేశంలో కొత్తూరి శ్రీనివాస్, ఒంటెద్దు బాబి, అయితా బత్తుల సుభాషినీ, కుడుపూడి శ్రీనివాస్, కుమార్ సింగ్ పాల్గొన్నారు.

పోలిస్ స్టేషన్ ఐజీ సందర్శన

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు సర్కిల్ పరిధిలోని మలికిపురం స్టేషను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ బుధవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులను పోలీసుల పనితీరును పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో నేరస్థులను పట్టుకునేందుకు కొత్త టెక్నాలజీ వినియోగిస్తున్నామని ఐజీ తెలిపారు. ప్రతి ఏరియాలోను సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉం టుంది. కోనసీమ జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గంజాయి సరఫరా తక్కువగానే ఉందన్నారు. ప్రభుత్వం మహిళల కోసం శక్తి యాప్‌ను వేశపెట్టిం దన్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాజోలు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండలంలో కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహ దారి నిర్మాణ పనులను ఎన్‌హెచ్ అధికారులు అసంపూర్తిగా వదిలివేయడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలం లోని శివకోడు మూలమామిడి సెంటర్‌లో బుధవారం ఉదయం జాతీయ రహదారిపై వెళుతున్న లోడు లారీ అదుపుతప్పి దిగబడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. జాతీయ రహదారికి బెర్మ్ ఏర్పాటు చేయటం వల్ల ఈ ప్రమాదం జరిగిందని అంటు న్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు స్పందించి జాతీయ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం సాధించగలిగాం : ఎమ్మెల్యే



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : చారిత్రక, సాంస్కృతిక, కళా రాజధాని రాజమండ్రికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాధించగలిగానని సిటీ ఎమ్మెల్యేగా దీనికి గర్వపడుతున్నానని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. రాజమండ్రి కేంద్రంగా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలియచేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇది కూటమి ప్రభుత్వ విజయమని అన్నారు. తిలక్ రోడ్డులోని తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో పదేళ్ళపాటు హైదరాబాద్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయాన్ని ఇకపై రాజమండ్రి కేంద్రంగా ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ తాను 2024 ఆగస్టు 5న ఐటి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రతిపాదన పంపించానని, దీనిపై పూర్తి వివరాలు పంపించాలని ఆయన సూచించడంతో 2024 సెప్టెంబర్ 17న అన్ని వివరాలు అందచేసినట్లు తెలిపారు. ఆనాడు లోకేష్ తాత దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఈ విశ్వ విద్యాలయం స్థాపిస్తే నేడు ఆయన మనవడు లోకేష్ దీనికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేశారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలు దృష్టిలో ఉంచుకుని మన తెలుగు వారసత్వం, చరిత్ర ప్రతిబింబించేలా రాజమండ్రిలో తెలుగు విశ్వ విద్యాలయం స్థాపించాలని కోరినట్లు ఆయన చెప్పారు. దీంతోపాటు బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, ఆంధ్ర మహిళా సంస్కృత కళాశాల ఏర్పాటు కావాలని కోరామని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయానికి 2024-25 సంవత్సరానికి జూన్ 1, 2024న తెలంగాణ విద్యార్థులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని, దీంతో యూనివర్సిటీ ఆంధ్ర రీజియన్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ వి నిరీక్షణబాబు ఈ విషయం మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి మనం నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని చెప్పారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. అన్ని కలిసి వచ్చి ఇప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం రాజమండ్రి కేంద్రంగా బొమ్మూరులో ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. తెలుగు విశ్వ విద్యాలయం బొమ్మూరు సాహిత్య పీఠానికి 50 ఎకరాల స్థలం ఉండేదని ఇటీవల అందులో 17 ఎకరాలకు పైగా జీపీసీఎల్, నాక్, కలెక్టర్ కార్యాలయం భవనాలకు కేటాయించారని ఆయన తెలిపారు. మిగిలిన ఎకరాల్లో తెలుగు విశ్వవిద్యాలయం 12 విభాగాలు ఏర్పాటు చేయడానికి సహచర ఎమ్మెల్యేలు ఎంపీ, మంత్రి కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటా మన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ ఎగ్జామ్స్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఏపి ఈఏపిసెట్-2025 ఆన్లైన్ ఎగ్జామ్స్ మూడో రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో రోజు ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 237కు 228 హాజరు. 9 మంది గైర్హజరు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295కు 281 హాజరు కాగా 14 మంది హాజరు కాలేదు. అలాగే సాయంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 239కి 231 హాజరు.. 08 మంది హాజరు కాలేదు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 294కి 288 హాజరు. 6 మంది హాజరు కాలేదు. ఈ ఎగ్జామ్కు చీఫ్ సూపరింటెండెంట్గా ఆదిత్య ప్రో వైస్ ఛాన్సలర్ డా ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, ప్రో ఎం రాజబాబు, ప్రొ టి శ్రీనివా సులు, ప్రో వీర ప్రసాద్ కో ఆర్డినేటర్లుగా వ్యవహ రించారు.. ఉదయం నుంచి వర్షం కురవడంతో ఆర్టిసిలో వచ్చిన విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెయిన్ గేట్ నుంచి పరీక్షా కేంద్రాలకు ఆదిత్య యాజమాన్యం తమ బస్సుల్లో బ్యాటరీ వాహనాలు ద్వారా తరలించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ప్రదాత రాజీవ్‌గాంధీ

విశాలాంధ్ర - నిడదవోలు : ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగ విప్లవానికి నాంది పలికిన దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిడదవోలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడవరపు భద్రం దొర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాలులర్పించారు. ఈ సందర్భంగా భద్రం దొర మాట్లాడుతూ దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ఇంతటి అభివృద్ధి సాధించిందంటే దానికి రాజీవ్ గాంధీ ఆలోచనల ఫలితమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు భావన రమేష్, కాకి కిషోర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే టీడీపీ లక్ష్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏపీవో సరస్వతి ఆధ్వర్యంలో వెలుగు మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహామూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఆనాటి కాలంలో డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి రుణాలు ఇచ్చిన ఘనత టీడీపీదే అని ఆయన కొనియాడారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి వారు మనోధైర్యంతో నిలబడే విధంగా శిక్షణ అనంతరం ఉచిత కుట్టుమిషన్లను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల వారు పాల్గొన్నారు.

యోగతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -కొవ్వూరు : శరీర దారుఢ్యాన్ని పెంపొందిస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి యోగ దోహదపడుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. యోగ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పంతో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో నెలరోజులపాటు యోగ దినాలను నిర్వహిస్తున్న సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపుమేరకు బుధవారం కొవ్వూరు పట్టణంలో మెయిన్‌రోడ్ బస్టాండ్ సెంటర్‌లో యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఉల్లాసవంతమైన వికాసవంతమైన జీవనాన్ని గడపడానికి యోగ అవసరమని శరీర దారిద్ర్యంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగ దోహదపడుతుందన్నారు. యోగ యొక్క విశిష్టతను ప్రజలకు తెలియచేయాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించు కార్యక్రమం పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా నెలరోజుల పాటు భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ యోగ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు గంటమని రామకృష్ణ మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని మున్సిపల్ కమిషనర్ టీ నాగేంద్ర కుమార్ ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్ ఒకటో వార్డు కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది, ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బంది, మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేక్ నోట్ల నిందితుల అరెస్టు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ఫేక్ రూ.500లు నోట్లు చెలామణి చేస్తున్న నిందితులను మండపేట రూరల్ సిఐ దొరరాజు కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశ పెట్టారు. సిఐ దొరరాజు కదనం మేరకు రాజమహేంద్రవరంనకు చెందిన మన్యం వీర వెంకట సత్య సీతా రామారావు అంగర శ్రీనివాస్ రైస్ మిల్ ఎదురుగా వున్న కిళ్లీ షాపులో ఫేక్ రూ.500లు నోట్ ఇచ్చి, సిగరెట్ పెట్టి తీసుకున్నాడని తెలిపారు. రూ.500లు నోట్‌పై షాప్ యజమానికి అనుమానం వచ్చి, నిందితుడిని నిలదీయగా అతను పారిపోయే ప్రయత్నం చేశాడు. స్థానికులు సహాయంతో నిందితుడుని పట్టుకొని అంగర పోలీసులకు అప్పగించారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్ పీబి కృష్ణారావు ఆదేశాలు మేరకు పోలీసులు నిందితుడిని ఇంటరగేట్ చేసి, అసలు నిందితుల వివరాలు రాబట్టారన్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు సిఐ దొర రాజు, ఎస్ఐ రవికుమార్‌లు విజయవాడకు చెందిన వారా నవీన్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 44 ఫేక్ రూ.500లు నోట్లు, లాప్ టాప్, పెన్ డ్రైవ్ తదితర ముద్రణ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారని వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ రవి కుమార్, వీఆర్ఓ సత్య నారాయణ, వీఆర్ఏలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ న్యూస్ ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : జర్నలిజంలో 20 సంవత్సరాలు పైబడి ఉన్న ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ముమ్మిడి లక్ష్మణ్‌పై పని కట్టుకొని అదే విధంగా సోషల్ మీడియా వివిధ రకాల మాధ్యమాలను వాడుతూ కొంతమంది విషప్రచారం చేస్తున్నారని, జర్నలిస్టుగా ఉన్నది ఉన్నట్టు రాస్తే ఇటువంటి ప్రచారాలు చేయడం ఎంతవరకు భావ్యమని కాకినాడ జిల్లా సీనియర్ జర్నలిస్టులు దుర్రాని, వాతాడ నవీన్ రాజ్, శివ నారాయణ రెడ్డి, కృష్ణంరాజు కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను బుధవారం కలిసి విన్నవించారు. పిఠాపురం నియోజకవర్గం ఎఫ్‌కే పాలెంలో అక్రమ మట్టి తవ్వకాలకు సంబంధించి కథనాలు రాయడం వలన కొంతమంది అక్రమార్కులకు వాస్తవాలను రాయడంతో మట్టి మాఫియాకి సంబంధించిన వాళ్ళు ఫేస్ బుక్ ఇతర మాధ్యమాలను వాడుతూ అసభ్యకర పోస్టులను ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ముమ్మిడి లక్ష్మణ్ పై ప్రతిరోజు అదే పనిగా పెడుతున్నారని జెసికి తెలియజేశారు. జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. దీనిపై స్పందించిన జెసి రాహుల్ మీనా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, కొంతమందిని కూడా గుర్తించడం జరిగిందని త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందని జెసి రాహుల్ మీనా హామీ ఇచ్చారు. కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ పిలుపుమేరకు అధిక సంఖ్యలో జర్నలిస్టులు వర్షానికి సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకొని వర్షంలో నిరసన, ధర్నాను చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు దుర్రాని, వాతాడ నవీన్ రాజ్, శివ నారాయణ రెడ్డి, కృష్ణంరాజు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్‌లు మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాసే జర్నలిస్టులపై ఇటువంటి ఫేక్ న్యూస్‌లు ప్రచారం చేయడం తగదని, ఫేస్బుక్ ఇతర మాధ్యమాలలో అదేపనిగా విష ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇటువంటి పోస్టు పెట్టడం మంచి పద్ధతి కాదని అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు సంబంధించిన వారిని అరెస్టు చేయగలరని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీధి గోపీనాథ్, మంగ వెంకట శివరామకృష్ణ, చైతన్య కృష్ణ, మేకల వెంకటరమణ, చిట్టీ, పుర్రె త్రినాద్, రాజు, దొరబాబు, వెంకట రమణ, మాధన్, ముమ్మిడి లక్ష్మణ్, దుళ్ళ శ్రీధర్, గణపతి, శ్రీధర్, రాజ్ కమల్, సత్య, రెడ్డి, వినయ్, శ్రీను, అడప సతీష్, ఫరక్, శ్రీహరి పాల్గొన్నారు.

కాళేశ్వరం పుష్కరాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురండిపో నుండి కాళేశ్వరం పుష్కరాలుకి స్పెషల్ బస్సులు మే 22 అమలాపురం నుంచి రెండు ఇంద్ర ఏసీ బస్సులు ఫుల్ అయినా కారణంగా భక్తుల నుండి వచ్చిన విశేషా ఆదరణ వలన మరల 24 శనివారం రోజున ఇంద్ర ఏసీ బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని అని డిపో మేనేజర్ చల్లా. సత్యనారాయణ మూర్తి తెలియజేసారు. మరిన్ని వివరాలకు రిజర్వేషన్ కౌంటర్ ఇంచార్జ్ ఎన్ వరహాల బాబును 9676266777 సంప్రదించ వలసిందిగా తెలియజేసారు.

ఎండీయూ ఆపరేటర్స్‌ను కొనసాగించాలి

విశాలాంధ్ర - పెదపూడి : గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్న ఎండీయు ఆపరేటర్స్ వ్యవస్థ అగ్రిమెంట్ 2027 జనవరి వరకు ఉందని దానిని ప్రభుత్వం కొనసాగించాలని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయు) అపరేటర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. వారు పెదపూడిలో బుధవారం తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎం సత్యనారాయణరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాంబత్తుల రవిచంద్ర, వాసంశెట్టి అప్పారావు, గాజంగి వీరబాబు, ఆచంట నాగేంద్ర, టీ లక్ష్మీనారాయణ, ఎం సత్తిబాబు, కె శేఖర్, టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని విధులోకి తీసుకోవాలి : ఆపరేటర్లు

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం తిరిగి మమ్మల్ని విధులోకి తీసుకోవాలని ఎమ్ డి యు ఆపరేటర్లు వినతి పత్రం సమర్పించారు. బుధవారం తహసిల్దార్ ఏ శ్రీనివాస్ కు మండల ఎమ్ డి యు ఆపరేటర్లు సంఘ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్ డి యు ఆపరేటర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటి ఇంటి రేషన్ అందించే విధంగా మాతో 6 సవంత్సరాలు అగ్రిమెంట్ చేసుకున్నారు. కానీ నేడు ఏ విధమైన ముందస్తు సమాచారం లేకుండా మమ్మల్ని విధుల నుండి తొలగించడం దారుణం అని అన్నారు. ఏలిన వారు దయవుంచి మమ్మల్ని తిరిగి విధులోకి తీసు కోవాలని కోరారు. అలాగే తిరిగి విధులోకి తీసుకొనే వరకు రాష్ట్ర ఎమ్ డి యు ఆపరేటర్లు సంఘం ఆదేశాల మేరకు శాంతియుతంగా నిరసన తెలుపు తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోసియ్య, శ్రీనివాస్ మొదలగు ఎమ్‌డియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

తూర్పు నాబార్డ్ డిడిఎంగా చక్రధర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా నాబార్డ్ జిల్లా అభివృధి మేనేజర్ (డి డి ఎమ్) గా చక్రధర్ రావూరి కొత్తగా పదవీ బాధ్యతల్ని స్వీకరించడం జరిగింది. గతంలో అల్లూరి సీతారా మరాజు జిల్లాలో పనిచేసిన చక్రధర్ బదిలీపై తూర్పు గోదావరి జిల్లాకు రావడం జరిగింది. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మూడు జిల్లాలకు ఏజిఎమ్‌గా వ్యవహరించిన డా వైఎస్ నాయుడు కాకినాడ, కోనసీమ జిల్లాల నాబార్డ్ ఏజీఎం గా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.తూర్పు గోదావరి జిల్లా నాబార్డ్ డి డి ఎమ్ గా చక్రధర్ మంగళవారం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నాబార్డ్ డిడిఎంగా బాధ్యతలు చేపట్టిన చక్రధర్ రావూరికి పలువురు అభినందనలు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్స్‌కు పంచాయతీ సెక్రెటరీగా పదోన్నతి

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండలంలో వివిధ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి పంచాయితీ సెక్రటరీ గ్రేడ్ -5గా పదోన్నత లభించింది. మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిపిఓ పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. దొర శ్రీనివాస్ (ఊలపల్లి- 2), కర్రి రాజగోపాల్ రెడ్డి (తాపేశ్వరం 2), కర్రి అరవింద్ రెడ్డి (కొంకుదురు 2), కేశనకుర్తి రాజు (బిక్కవోలు 4), నల్లమిల్లి కోటిరెడ్డి (అనపర్తి 3) సచివాలయానికి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5 గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన కార్యదర్శుల బృందం ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డిని, మండల అభివృద్ధి అధికారి మండ రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా పదోన్నతి పొందిన కార్యదర్శులను అభినం దించారు.

రేషన్ షాపుల వద్ద మోదీ ఫోటో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కడియం : జూన్ ఒకటవ తేదీ నుండి ప్రతి రేషన్ షాప్ వద్ద బియ్యం సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై కడియం మండల బీజేపీ అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు. పేదలకిచ్చే బియ్యం రేషన్ డిపోల వద్ద రేషన్ షాపుల వద్ద నరేంద్రమోదీ పోటో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రదానమంత్రి నరేంద్రమోదీ కరోనా కష్ట కాలం నుంచి పూర్తి ఉచితంగా దేశవ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన నిరుపేదలు మధ్యతరగతి కుటుంబాలకు అర్హులందరకీ తలకొక్కంటికి 5కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ రేషన్ బియ్యం గత వైసీపీ ప్రభుత్వంలో పక్కదారి పట్టాయని ఆరోపించారు. వాటిని నివారించడానికి ఈ కెవైసీ అప్ డేట్ చేసి బియ్యాన్ని అర్హులైన వారికే అందజేసేలా చర్యలు తీసుకొంటుందన్నారు. ఇప్పటివరకు అప్ డేట్ చేయించుకోని వారు వివరాల ప్రకారం రేషన్ డీలర్ వద్ద, ఈ పాస్ యంత్రంలో వేలిముద్ర వేసి, కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు, 65ఏళ్లు దాటినవార్కి డోర్ డెలివరీ ఉంటుందని పేర్కొన్నారు.

పట్టాభి కుటుంబానికి చందన నాగేశ్వర్ పరామర్శ

విశాలాంధ్ర - కడియం : పితృ వియోగంతో బాధ పడుతున్న వైసీపీ నాయకుడు శాకా పట్టాభి కుటుంబాన్ని మాజీ రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. బుధవారం కడియం గ్రామంలోని పట్టాభి స్వగృహం చేరుకున్న చందన ముందుగా దివంగత శాకా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాకా కుటుంబ సభ్యులకు, సోదరులు శాకా వెంకన్న బాబు, శాకా సురేష్‌లకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మన ధరిత్రి మన ఆరోగ్యం : మంత్రి కందుల

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తూర్పు గోదావరి జిల్లా పరిధిలో యోగాంధ్ర ప్రచార కార్యక్రమం ప్రారంభోత్సవం రాజమహేంద్రవరంలోని గౌతమి ఘాట్ వద్ద బుధవారం ఉదయం నిర్వహించడం జరిగింది. మన ధరిత్రి మన ఆరోగ్యం("యోగ ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్") అనే నినాదంతో ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ , జిల్లా కలెక్టర్ పి ప్రశాంతిలు కోరారు. ప్రభాత కిరణాల వెలుగులో, అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో గోదావరి నది ఒడ్డున గౌతమీ ఘాట్లో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి,జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, సంయుక్త కలెక్టర్ చిన్న రాముడు,నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ లతో కలిసి మంత్రి ప్రారంభించారు. యోగాంధ్ర కార్యక్రమం పై రాష్ట్ర ప్రభుత్వం తనతో పాటు ఐదుగురు సభ్యుల మంత్రుల కమిటీని నియమించిందని కందుల దుర్గేష్ తెలియజేశారు. ప్రముఖులను, సెలబ్రెటీలను, కళాకారులను, కూచిపూడి నర్తకిమణులను యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనున్నట్లు ఆయన తెలిపారు. యోగాకు అత్యంత ప్రాధాన్యం ఉందని, విదేశీయులు కూడా తమకు యోగా నేర్పించాల్సిందిగా కోరుతున్నారని దుర్గేష్ తెలియజేశారు. మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా మాసంగా పాటిస్తూ యోగ సాధన పై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ యోగా అభ్యాసాలపై అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖామాత్యులు నారాలోకేష్ ల ఆధ్వర్యంలో యోగాకు సంబంధించి వివిధ కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ...ఆరోగ్యకర జీవన విధానానికి యోగ అత్యంత ఆవశ్యకమని, మన జీవన విధానంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, డిఆర్ఓ సీతారామమూర్తి అదనపు ఎస్పి మురళీకృష్ణ, ఆర్డీవో నాయక్, డిఎస్పి భవ్య కిషోర్, డి ఎం హెచ్ వో డా కే.వెంకటేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ, అధికారులు, విద్యార్థులు, యోగ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో 'నందిగంపాడు' జిల్లాలో మొదటి స్థానం

విశాలాంధ్ర - చాగల్లు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా ప్రతిస్పందన సర్వేలో నూరు శాతము ఫలితాలు వచ్చి, నందిగంపాడు గ్రామపంచాయతీ తూర్పుగోదావరి జిల్లాలో ప్రధమ స్థానంలో నిలిచిందని మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఐవీఆర్ఎస్ సర్వేలో మీ ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుచున్నదా అను ప్రశ్నకు వందశాతం, వారానికి కనీసము రెండుసార్లు పైబడి మీ ఇంటి నుండి చెత్తను సేకరిస్తున్నారా అను ప్రశ్నకు వందశాతం ప్రజలు ఆమోదం తెలియపరిచారు. చాగల్లు మండలంలోని చాగల్లు, దారవరం, నెలటూరు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల మల్లవరం గ్రామపంచాయతీలు చెత్త సంపద కేంద్రాల పనితీరులో కొవ్వూరు డివిజన్లో చాగల్లు మండలం, రెండవ స్థానం లభించింది. అనంతరం బుధ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, మండల పరిషత్ అధికారి, పంచాయతీ కార్యదర్శులు నందిగంపాడు పంచాయతి కార్యదర్శి శిరీష రాణిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా, మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీవో అభినందనలు తెలియపరిచారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి

విశాలాంధ్ర-దేవరపల్లి : భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పరిచిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేనిని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి వెలగా రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబులు పేర్కొన్నారు. దేవరపల్లిలో బుధవారం మూడు బొమ్మలు సెంటర్ వద్ద రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగా రామకృష్ణ మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రధానమంత్రి పదవి చేపట్టి భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచారని తెలిపారు. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని మరింత అభివృద్ధి పరసి ప్రపంచ దేశాలలో భారత దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడించిన ఘనత రాజీవ్ గాంధీ అన్నారు. రాజీవ్ గాంధీ చేపట్టిన సంస్కరణ వలన పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత పటిష్ట జరిగిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణ వలన భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ శిలా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దేవరపల్లి మండల ఉపాధ్యక్షుడు పాపోలు గంగారావు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముళ్ళపూడి చిట్టిబాబు, సీపీఎం నాయకుడు కొత్త గుండి రత్నాజీ స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజన సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్డిఏ పిడి జి శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అసిస్టెంట్ల సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడి హాజరయ్యారు. ప్రత్తిపాడు మండలం సంబంధించి 56 వివోఏలతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై సమీక్ష చేస్తూ ప్రతిపాడు మండలానికి 2000 రూఫ్ టాప్‌లు పెట్టించాలని దానికి ప్రతి డ్వాక్రా సభ్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పీఎం సూర్య ఘర్ ద్వారా రాయితీని పొందాలని తెలిపారు. అలాగే శ్రీనిధి, సిఐఎఫ్, విఆర్ఎఫ్ మరియు ఉన్నతి రికవరీలు నూటికి నూరు శాతం ఉండాలన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని డ్వాక్రా సభ్యులు నూతన యూనిట్లు ప్రారంభించాలన్నారు. అలాగే ప్రతి మహిళ తమ ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీడి జిలాని, డిపిఎంలు రాయ్, భరత్, అనిల్, ఏపిఎం వై వెంకట్, సీసీలు శ్రీను, శ్రీనివాస్, నూకరత్నం, అకౌంటెంట్ నాగు, వివోఏలులు హాజరయ్యారు.

ఇంటింటికి రేషన్ పంపిణీ కొనసాగించాలి

విశాలాంధ్ర - కడియం : పిడిఎస్ బియ్యం మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లను తీసివేస్తూ జారీ చేసిన జీవోను వెంటనే వెనుకకు తీసుకోవాలని కోరుతూ కడియం తహసీల్దార్ కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం 2021 సంవత్సరంలో పిడిఎస్ రేషన్ పంపిణీ కోసం 9260 రైస్ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌లను ఆరు సంవత్సరాల పాటు జీవనోపాధి కల్పిస్తూ జీవోను (రి.నెం. 369 ఆర్ఏ-27-01-2022) జారీ చేసిందని పేర్కొన్నారు. ఆ రోజు నుండి ఈరోజు వరకూ కష్టనష్టాలను ఒడిదుడుకులను ఓర్చుకుంటూ, కరోనా కాలంలో డబల్ రేషన్ ఇచ్చి, రెడ్ జోన్లలో కూడా పని వత్తిడి పెరిగినా పంపిణీ చేశామని తెలిపారు. తమలో చాలా మంది కరోనా బారిన పడినప్పటికీ, 100 శాతం రేషన్ పంపిణీ చేశామని తెలిపారు. 2024 సెప్టెంబర్ నెలలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం మా వంతు సహాయం కూడా అందించామన్నారు. 20 న జరిగిన క్యాబినెట్ సమావేశంలో లో అర్ధాంతరంగా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా 9260 రైస్ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లను తీసివేస్తూ జివో జారీ చేయడం అన్యాయమన్నారు. దీనివలన ఒక్కొక్క మొబైల్ యూనిట్ కి రెండు కుటుంబాల చొప్పున చూసినా మొత్తం 18,520 కుటుంబాలు జీవనోపాది కోల్పోతారని వాపోయారు. 2026 డిసెంబర్ నెలాఖరు వరకూ తమకు అగ్రిమెంట్ ఉన్నదని, కనీసం అప్పటివరకు అయినా తమను కొనసాగించాలని కోరుతూ ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన దుర్గా ప్రసాద్, మండల అధ్యక్షులు యనమదల మణికంఠ, బేధంపూడి వెంకన్న, ఓం ప్రసాద్, పిల్లి సుబ్రహ్మణ్యం, జె పి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగ్ యాత్ర

విశాలాంధ్ర -తాళ్లపూడి : ఉగ్రవాదం పై భారత్ చేసిన దాడులు కారణంగా ప్రపంచానికి భారత్ బలం తెలిసిందని, ప్రధాని మోదీ చెప్పినట్లు భారత్ పైకి ఏ దాడి జరిగిన ఉగ్రదాడిగానే పరిగణించి దాడులను త్రిప్పి కొడతామని బిజెపి నాయకులు పిల్లమర్రి అన్నారు. మండల కేంద్ర మైన తాళ్లపూడి లో ఆపరేషన్ సిందూర్ విజయవంత మైన సందర్భంలో తిరంగ్ యాత్ర చేపట్టారు. ఉగ్రవాద దాడిలో అమరులైన సైనికుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ, భారత్ సలిపిన పోరు వివరిస్తూ తీరంగ్ యాత్ర చేపట్టారు. 1000 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని మతాలకు కులాలుకు అతీతంగా ఈ యాత్ర నిర్వహించారు. వందే మాతరం, అంటూ వినదిస్తూ తాళ్లపూడి మెయిన్ రోడ్ లో చేపట్టిన కార్యక్రమం విజయవంత మైంది. ఉద్యోగులు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం : మంత్రి కందుల

విశాలాంధ్ర - నిడదవోలు : నిత్యం చేసే యోగాతో మెరుగైన, ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిడదవోలు పట్టణంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ యోగాతోనే శరీరానికి ఆరోగ్యమని, యోగా చేయడం వలన ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరి నిత్యా జీవితంలో యోగా ఒక భాగం కావాలని తద్వారా ఆరోగ్యకరమైన మంచి జీవన విధానం అలవడుతుందన్నారు. యోగా వలన ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగడంతో పాటుగా మెరుగైన జీవనానికి యోగా దోహదపడుతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు డాక్టర్ బూరుగుపల్లి అప్పారావు, సానేపు వెంకట సుబ్బారావులతో కలిసి మంత్రి యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి . కృష్ణవేణి, తహసీల్దార్ నాగరాజునాయక్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొనగా యోగా గురువు డా. బూరుగుపల్లి అప్పారావును మంత్రి దుర్గేష్ దుశాల్వాతో సత్కరించారు.

యోగాతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి: యోగ చేయడం వలన శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం యోగా మాసోత్సవంలో భాగంగా స్థానిక శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొని మాట్లాడుతూ యోగా ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మండ రామకృష్ణారెడ్డి, తాహసిల్దార్ అనిల్ కుమార్, పలువురు ఎన్‌డిఏ నేతలు, కార్యకర్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు : ఆర్డీవో

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర -కొవ్వూరు : అఖండ గోదావరి కుడిగట్టుపై నిర్మితమైన అక్రమ కట్టడాలను నిర్మాణం అవుతున్న కట్టడాలను క్షేత్రస్థాయిలో పర్యటించి తగు నిర్ణయం తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. విజ్జేశ్వరం నుంచి ఇటు పోలవరం వరకు ఏటి గట్టు పై అక్రమ కట్టడాలు నిర్మితమ య్యాయని, మరి కొన్ని కట్టడాలు నిర్మించడానికి కొందరు సిద్ధమవుతున్నారని సమాచారంతో విశాలాంధ్ర గత మూడు రోజులుగా వరుస కథనాలు ఇస్తుంది వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఆర్డీఓ ఏటిగట్టును తాను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు అనంతరం ఇరిగేషన్, మున్సిపాలిటీ దేవాదాయశాఖ లతోపాటు సంబంధిత శాఖల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పుష్కరాలు విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆమె వివరించారు.

వందేమాతరం నినాదంతో పులకించిన క్షీరపురి

విశాలాంధ్ర - పాలకొల్లు: వందేమాతరం నినాదం పాలకొల్లు పురవీధుల్లో మార్మోగింది. ఒక్కసారిగా వందేమాతరం నినాదాలు మిన్నంటడంతో క్షీరపురి జన్మ చరితార్థమైంది. హమారా భారత్ మహాన్ హై.. సారే జహాసే అచ్చా హిందుస్థా హమారా అంటూ కూటమి నాయకులు నినాదాలు చేస్తూ జాతీయ పతాకంతో జాతీయ జెండాలతో పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హ్యాట్రిక్ ఎమ్మెల్యే రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సారథ్యంలో కూటమి నాయకులు వీర మహిళలు తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎడ్ల బజారు ఫైర్ స్టేషన్ నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ గాంధీ బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. భారత్ మాతాకీ జై అంటూ భారత ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై హర్ష వ్యక్తం చేస్తూ భారత త్రివిధ దళాధిపతులకు సైనికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాకిస్తాన్ దూకుడు చర్యలకు కళ్లెం వేయవలసిన తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, హోమ్ మినిస్టర్ అమిత్ షా త్రివిధ దళాధిపతులు ఎంతో చాకచక్యంతో ప్రవర్తిస్తూ తమ చతురతను ప్రదర్శిస్తూ భారతీయులకు మనో ధైర్యాన్ని కల్పించడం చాలా అభినందనీయమన్నారు. మనదేశంలోనే కాకుండా ప్రపంచంలోనే టెర్రరిజాన్ని అణిచివేయవలసిన తరుణం ఆసన్నమైనదని దీనికి ఐక్యరాజ్యసమితి కూడా ఆమోదం తెలిపిందని ప్రపంచ దేశాలన్నీ టెర్రరిజాన్ని వ్యతిరేకించే విధంగా మన భారతదేశానికి సంఘీభావం తెలియజేయడం శు భపరిణామం అన్నారు. భవిష్యత్తులో పెహల్గాం వంటి దాడులు జరక్కుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. తిరంగా విజయవంతంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి మంత్రి రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, బిజెపి నాయకులు యర్రంశెట్టి పద్మారావు, ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు- రోజా రమణి, గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, పాముల రజిని కుమార్,, మామిడి శెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, బోణం నాని, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, పెన్మెత్స రామభద్ర రాజు, బందెల భాస్కర్, రావూరి అప్పారావు, జనసేన నాయకులు బోణం చినబాబు పాల్గొన్నారు.

మెరుగైన జీవనానికి యోగా దోహదం : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. స్థానిక వట్లూరు టిటిడిసిలో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి యోగా ఓరియెంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు 'యోగాంధ్ర' కార్యక్రమం దోహద పడుతుందన్నారు. జూన్ 21 యోగా దినోత్సవం పురస్కరిం చుకుని మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజులపాటు యోగా మాసంగా పాటిస్తూ యోగసాధనపై జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహణలో భాగంగా రూపొందించిన యాప్‌ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరిం చారు. ఈ యాప్‌లో అందరూ నమోదై ఉపయోగించుకోవాలని సూచించారు. వేముల ధర్మారావు ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వర రావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఆయుష్ ఆర్‌డిడి లక్ష్మి సుభద్ర,డిఆర్‌పి పీడీ ఆర్.విజయరాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: యోగాంధ్ర-2025 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యోగా ఆరోగ్యవంతమైన నవసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కాస్మోపాలిటన్ క్లబ్ ఆడిటోరియంలో జూన్ 21న జరుగనున్న 11వ అంతరా తీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర-2025' కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభించారు. కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అందరితో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని యోగా అభ్యాసనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డియల్డివో వై.దోసిరెడ్డి , డిఇవో ఇ.నారాయణ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కాస్మోపాలిటన్ క్లబ్ ప్రతినిధులు, మహిళలు, పట్టణ ప్రముఖులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆత్మాగౌరవం నుంచి టీడీపీఆవిర్భావం

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: తెలుగు ప్రజల ఆత్మా గౌరవం నుంచి పుట్టిన పార్టీనే తెలుగుదేశం పార్టీ అని రుడా ఛైర్మన్,రాజానగరం నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. నియోజకవర్గంలోని కోరుకొండ మండలంలోని పార్టీ కార్యాలయంలో వద్ద బుధవారం జరిగిన మినీ మహానాడుకు నియోజకవర్గం నుండి తెలుగు తమ్ముళ్లు భారీగా చేరుకున్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజ మహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా టీడీపీ పార్టీ మహానాడుని నిర్వహించు కుంటూ దశ నిర్దేశాలను నిర్ణయించుకుంటుందన్నారు. టీడీపీ పార్టీ ఎన్నో ఆటుపోట్లను చూసి పసుపు జెండా పట్టుకున్న ప్రతీ కార్యకర్త జీవితానికి భీమా అందించి బరోసా కల్పించిన తొలి పార్టీ అని కొనియాడారు. కడపలో నేడు జరగనున్న మహానాడు చరిత్రలో మిగిలిపోయే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు రూపుదిద్దుకు న్నాయనీ, దీంతో తెలుగు తమ్ముళ్లు,కార్యకర్తలలో జోష్ నింపుతోందన్నారు .మహానాడు అంటే ప్రజలకు ఉపయోగపడే తీర్మానాల ద్వారా ప్రజలకు మేలు చేసేవిధంగా ఉంటుంది అన్నారు.రాజానగరం నియోజకవర్గం అంటే వ్యవసాయ ఆధారిత ప్రాంతం అని అలాంటి ఈ నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి వల్ల సాగునీటి ప్రాజెక్టుల అస్తవ్యస్తంగా మారాయని దుయ్యబట్టారు. సభ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన టీడీపీ నేతలు,నాయకులు, కార్యకర్త లుకు రాజానగరం నియోజకవర్గం పెట్టింది పేరు అని కొనియాడారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పై

తీర్మాలను మహానాడు ద్వారా సీఎం గారి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి (మల్లిబాబు),యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు),కాండ్రు శేఖర్, కాండ్రు శ్రీనివాసరావు, గద్దె నాని, నూనె వెంకన్న, కొల్లం రత్నం,వలవల రాజా, సంగన చినపోసియ్య, ఓబులనేని కృష్ణ చైతన్య, రాజానగరం, కోరుకొండ,సీతానగరం మూడు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.